స్త్రీ సాహసము..

గోపరాజు రాజన్న

౧

సీతమ్మ రోజూ కోనేటికి నీళ్లకి వెళ్లడం చూస్తూ ఉన్నాడు దొంగల గురువైన కామయ్య. కోనేరు ఊరికి ఫర్లాంగుమారములో ఉన్నది. వేసవి కాలము వచ్చినప్పటినుంచీ సీతమ్మ ప్రొద్దున్నా, సాయింత్రమూ కోనేటికి వెళ్లేది. కోనేటిగట్టుమీద విశాలమైన రావిచెట్టుక్రింద డేరాలు వేసికొని కామయ్య తనగుంపుతో బసచేశాడు. ఊరివారందరూ కామయ్య పేరు చెప్పేసరికి చిన్నమెత్తయినా బంగారము బయట ఉంచక భూమిలో పాతిపెట్టివేశారు. కామయ్య బందిపోటుదొంగతనంలో ఆరితేరిన ఆసామీ అనిన్నీ, వాని చేతిక్రింద ఉన్న పది పదిహేనుగురూ దిట్టదీరిన బందిపోటుదొంగలనిన్నీ ఊరివారందరికీ పరిచితమే. పాపం, సీతమ్మకీ సంగతులేవీ తెలియవు. బందిపోటుదొంగల్ని గురించి బడిలోనైనా చదువుకొనలేదు. పుట్టింటివారు భాగ్యవంతులు అత్తవారంతకన్నా భాగ్యవంతులు. ఇంక నగలకి కొదువేమున్నది? ఆపిల్ల మొయ్యలేనన్ని నగలు ఆమెను మొయ్యమని వారు శాసించినారు.

ఒకనాడు సీతమ్మ కోనేటికి వెళ్లుతూ ఉండగా పెద్ద ఉరుములు, మెరుపులు వచ్చినవి. మనిషి మనిషీ కనపడకుండా గాలిదుమారం ఊరంతా చుట్టబెట్టినది. కామయ్యడేరాలు గాలిలో ఎగిరిపోయినవి. కోనేటికి పదడుగులదూరములో ఉన్నది సీతమ్మ. కనుబొమలు చిట్లించుకుంటూ పరకాయించి సీతమ్మవైపు చూశాడుకామయ్య. సీతమ్మ తనదే అని ఉప్పొంగిపోయాడు. డేరాలు ఎగిరిపోయినా నిశ్చింతగా మత్తెక్కినట్టు కూర్చున్నాడు. ఎంతచూస్తే తనకేమి భయం అని ధిక్కరిస్తూఉన్నట్లు సీతమ్మ రెండడుగులు వేసినది. కామయ్యను ఎవరో రాళ్లతో కొట్టుతున్నట్టు వడగళ్లవాన కోనేటిగట్టుదిశనుండి ప్రారంభించినది. ఆవాన సీతమ్మనుకూడా ముంచెత్తినది. కామయ్య సీతమ్మనుచూడ్డం మానివేసి సామానులు సర్దుకోడం మొదలుపెట్టాడు. సీతమ్మ వెనక్కితిరిగింది. ఇంటికి పదడుగులు దూరంలో ఉండేసరికి వాన వెలిసిపోయినది. కాని సీతమ్మగుడ్డలు తడిసి ముద్దలైపోయినవి. పొరుగింటి ముసలమ్మ సీతమ్మను చూచి. 'అమ్మాయీ, సీతమ్మా, కోనేటివద్ద కామయ్య బసచేసి ఉన్నాడు. నగల్తో కోనేటికి వెళ్లకమ్మా', అన్నది. సీతమ్మ చిన్నచిరునగవు నవ్వి, 'నగలుంటేమాత్రం కామయ్యేం చెయ్యగలడు?' అని అన్నది.

"కామయ్యకు తగినశాస్తి......అన్నది సీతమ్మ."

'కామయ్య దొంగలగురువు. పసిపిల్లవు, వాడి సంగతిసమాచారం నీ కేం తెలుసు ?'

'ఆఁ! అలాగా! కామయ్యకు తగినశాస్తి చేస్తాను చూడండి!' అన్నది సీతమ్మ. ముసలమ్మ సీతమ్మను పరిహసించి, 'ఔను, ఔను, ఊరివారందఱూ చెయ్య లేనిపని నీవు చెయ్యగలవు!' అన్నది.

౨

కామయ్యకు మనసు మనసులో లేదు. సీతమ్మ చిక్కితే రెండులాభా లనుకున్నాడు. ఒకటి, సీతమ్మ చక్కనిచుక్క. రెండు, సీతమ్మ వొంటిమీద యెలాగ లేదన్నా ఐదాఱువేల నగలున్నవి. చదివిన పుస్తకాన్నే చదివినట్టు చూచిన సీతమ్మనే రోజూ చూస్తున్నాడు కామయ్య. సీతమ్మయొక్క చక్కదనం, ఆభరణములు కామయ్యకు కంఠోపాఠమైపోయినవి ఎప్పుడు సీతమ్మను చెఱపట్టడమా అని వాడిమనసు పరితపించి పోతూఉన్నది.

3

సీతమ్మ గొప్పయింటిబిడ్డ. అందమైనపడుచు. చదువు, సంగీతము చక్కగా నేర్చినపిల్ల. అత్తవారింటిలో దాసీజనము సమృద్ధిగా ఉన్నప్పటికీ స్వయముగా ఇంటిపని చక్కబెట్టుకునేది.

కామయ్యపేరు చెబితే గడగడలాడి పోతున్నారు ఊరిలోని ప్రజలు. కాక, పొరుగింటిముసలమ్మ సీతమ్మకు పిరికిమందు పోసింది. ఆ పిరికిమందుకి వశీకరాలు కాకుండా ఉండడానికి సీతమ్మ బహువిధాల ప్రయత్నిస్తున్నది. 'ఈకామయ్యను గంగలో కలపాలి' అని సీతమ్మ నిశ్చయించుకొన్నది. కాని, యేమోస్తరుగా తన ప్రతిజ్ఞ నెరవేర్చుకోవాలో తనకే తెలియదు. ఒంటరిగా కోనేటికి వెళ్లినప్పుడు కామయ్య బలాత్కారంగా చెఱపట్టితే సీతమ్మ యేమిచేయగలదు? తనహాని లోకనింద అన్నట్టు అవుతుంది. ఏమైనా సరే, కామయ్యను పరాభవించి, తనప్రాణానికైనా తెగించి, వాడిప్రాణం తీసి ఊరివారందఱి అనుగ్రహానికీ పాత్రురాలు కావలె ననుకొన్నది. ఒకబందిపోటుదొంగ పదిమంది అనుచరులతో కోనేటియొడ్డున బసచేస్తే ఊరివారంతా వాడికి కానుకలు సమర్పించుకోవడం, వాడిపేరు చెబితే ప్రజలు పిల్లు లయిపోవడం, ఇదెక్కడి న్యాయమని సీతమ్మ తనలో తాను వితర్కించుకొన్నది.

ఒకనాడు మజ్జిగకుండ ఉట్టిమీదనుండి క్రిందకు దింపి మజ్జిగచేస్తున్నది. ఒకవేళ తనభర్త లేనిసమయములో కామయ్య తనయిల్లు చొరబడితే ఏమిచెయ్యవలెనో అని ఆమెకు సందేహము తోచినది. ఆసందేహముతో మజ్జిగత్రిప్పడానికి ఉదాసీన చెప్పినది. లేచి నిలబడి వంటింట్లోనికి వచ్చినది ఇటూ అటూ చూసి పెరటిలో కొట్టుగదిలోనికి వెళ్లినది. వెళ్లి, గునపాం ఒకటి తీసుకు వచ్చినది. దానిని పాలగదిలో ఒకమూలగా ఉంచినది. 'కామయ్యకు దీనితోనే శాస్తి' అని గంభీరముగా అన్నది. ఇంతట్లో సీతమ్మభర్త భార్యను కేకవేసాడు. సీతమ్మ పలుక లేదు. కామయ్య తనకు ఎదురుగా ఉన్నట్టయితే తను ఆగునపముతో వాడికి ఎట్లు బుద్ధిచెప్పవలెనో సీతమ్మ నాటకపాత్రధరించు పాత్రధారిణివలె నటన చేస్తూ ఉన్నది. పిలుపుమీద పిలుపు పిలిచినా సీతమ్మ పలుక లేదు. అసలు సీతమ్మకు ఆపిలుపులు వినిపించనే లేదు. ప్రపంచకం అంతా మరచిపోయి కామయ్యకు స్వస్తిచెప్పు రంగములో అద్భుతనటన గావించుచున్నది.

'పట్నవాసపు పిల్లలు చెప్పినమాట వింటారా' అని గొణుగుకుంటూ శ్రీనివాసం పాలగదిలోనికి సుడిగాలివలె వచ్చాడు. సీతమ్మ నిశ్చేష్టురా లయిపోయింది. ఎదురుగా ఉన్నవాడు తనభర్తగాని కామయ్యకాడు. ఆ ఉద్రేకంలో గునపాంతో ఒక్కపెట్టు పెడితే భర్త యేమైపోను!

'ఈగునపం యేమిటి?' అని శ్రీనివాసం గద్దరించాడు.

ఒకము ల సగం సగం త్రిప్పిన మజ్జిగ. అతని గర్జనకి ఆమజ్జిగకుండలో ఉన్న కవ్వము కొం

ఞెము కదలినది. కాని ఇంతవరకూ సీతమ్మ ఆడిన నాటకము చెప్పలేక ఊరుకున్నది. సీతమ్మ నోరువిప్పలేదు. ఆగునపము ఒకమూల భద్రపఱచి 'ఇలారండి చెప్తా' అని భర్తను పాలగదిలోనుంచి బయటకు తీసుకువచ్చి కొంచెము ఆలోచించి 'ఏమీ లేదు' అన్నది. శ్రీనివాసానికి కోపానలము మఱింత ప్రజ్వరిల్లినది. నయాన్ని, భయాన్ని అడిగిచూశాడు కాని సీతమ్మ జవాబివ్వలేదు.

౪

ప్రాతఃకాలము కోనేటిరొడ్డున ఏదో కలవరము బయల్దేరినట్లు ఉన్నది. ఊరిలో వింత జరిగినట్లు చెప్పుకుంటున్నారు ఆడవాళ్లు. కొందఱు యింతులు కామయ్యడేరాలవైపు పదే పదే చూస్తూ గుసగుస లాడుతున్నారు. కామయ్య సుఖాసీనుడై ఒక్కడూ డేరాల్లో కూర్చున్నాడు. నడివయస్సులో ఉన్న పురుషుడొకడు డేరాయొద్ద ఆగాడు. డేరాలోనుండి వచ్చి, 'శ్రీనివాసంగారా, దయచెయ్యండి. ఏమి యాజ్ఞ,' అని కామయ్య నమస్కరించాడు.

శ్రీని: నీకు గ్రహపీడకు మంత్రము వచ్చుటకదూ!

కామ: చిత్తం, ఏలినవారిదయ. ఏదోతగుమాత్రం. ఎవరికి మంత్రం వెయ్యాలి బాబూ?

శ్రీనివాసం కొంచెముసే పాలోచించాడు. ఆలోచించి, 'తావేదేమయిన యిస్తావా? మాయింట్లో నే కావాలి...దబ్బుని ఉంటే ఇయ్యి' అని కామయ్యను తొందరపెట్టాడు. ఒక పావులాకు తావేసుకొని శ్రీనివాసం యింటికి సాగాడు. సీతమ్మకు పిచ్చపట్టినదా? గ్రహము పట్టినదా? కామయ్య ఆమెపాలిటి గ్రహమై ఆమెను పీడిస్తున్నాడు. ఈసంగతి మగనితో ఆమె చెప్పలేదు. తావేసు కట్టుకొమ్మని కామయ్య ఇచ్చిన తావేదు శ్రీనివాసం ఆమెకు ఇచ్చాడు. 'ఆతావేదు నేకట్టుకోను. కామయ్యమొఖాన్న పారెయ్యండి. నా పిచ్చమాటకేం గాని మీకు పిచ్చ పట్టినట్టుంది!' అని సీతమ్మ బహుధీమాగా పలికింది. ఈసంగతి కామయ్యకు తెలిసింది. కామయ్య కళ్లు చింత నిప్పులవలె చేసుకున్నాడు. ఊరంతా గడగడ లాడిపోతున్నది. కామయ్యకు కోపము తెప్పించినందుకు సీతమ్మను ఇరుగింటి పొరుగింటి అమ్మలక్కలు కూకలు వేసారు కోరి కయ్యం తెచ్చుకున్నావేలని శ్రీనివాసం విచారించాడు.

దీపాలవేళయినది. సీతమ్మ పాలగదిలోకి వెళ్లినది. మూలని పెట్టిన గునపము చూసుకున్నది. 'కామయ్యకు దీనితోనే శాస్తి' అని నిశ్చయించుకున్నది.

౫

మరునాడు ఎండ ఫెళ్లున పేలుస్తున్నది. సూర్యుడు నెత్తిమీదకి రాకముందే శ్రీనివాసం భోజనం చేసి రైతులను వెంటబెట్టుకొని తోటలు, పొలములు చూసుకోడానికి సాగాడు. ఇంటిలో పనులు చక్కబెట్టుకొని సావిట్లో కూర్చుంది సీతమ్మ. పొరుగింటి ముసలమ్మవచ్చి, 'సీతమ్మా, ఆవెధవతో నీకెందుకమ్మా లేనిపోని కయ్యం? కామయ్య మీయింటిమీద కన్ను వేశాడుట ఏదోమోస్తరుగా వాడితో మంచిగా ఉంటే మంచిది', అని హితబోధ చేసింది. సీతమ్మమనసు ఉద్రేకపూరిత మయిఉన్నది. ముసలమ్మ చెప్పినమాటలు చెవి కెక్క లేదు. కాని ఆమెతో అనవసరంగా వివాదం యెందుకని, 'నువ్వు చెప్పినది బాగానేఉంది అత్తయ్యా అన్నిటికీ భగవంతుడే ఉన్నాడు', అని సీతమ్మ అన్నది. ముసలమ్మ అక్కడ ఒకక్షణకు తీసి పిమ్మట యింటికి సాగింది.

సాయంకాలం సీతమ్మ కోనేటికి వెళ్లినది. నిన్నటివరకూఉన్న కామయ్యడేరాలు అక్కడ లేవు. రావిచెట్టుక్రింద నిశ్శబ్దముగా ఉన్నది. కామయ్యగాని, వాడి యనుచరులుగాని ఎవ్వరూ లేరు. సీతమ్మ సంతోషంవేసింది. బిందెతో నీళ్లుముంచి బుజంమీద పెట్టుకొని ఇంటికి వెళ్లింది. సూర్యుడు అప్పుడే అస్తమించాడు. వాకిట్లో పనిచేసే నౌకర్లు ఆమె సెలవుతీసికొని గృహోన్ముఖులయినారు. ఆనీళ్లబిందె వంటింట్లో తీనిమీద దించింది. వెనక్కి తిరిగింది .... ఇంకెవరు! ...... కామయ్య! ...... సీతమ్మగుండె గుభేలుమంది. నిర్భయంగా సీతమ్మకు దగ్గరగా నిల్చుని

ఉన్నాడు పెద్దమైనా మెదల్చకుండా కామయ్య. ఒక క్షణం ఐంది. సీతమ్మ కొంచెం ధైర్యం తెచ్చుకున్నది. ధైర్యంతోపాటు లేని చిఱునగవుకూడా తెచ్చుకుంది. ‘కామయ్యా, ఏం యిలా వచ్చావు? ఏంకావాలి?’

‘అమ్మా! పట్టెడు వణ్ణం.’

సీతమ్మ గిన్నెతో అన్నం తీసుకువచ్చింది.

‘అమ్మా! యిక్కడ భోంచేస్తాను. తమచేతితో వడ్డించండి.’

సీతమ్మ వడ్డించింది. కామయ్యను కూర్చోమంది. కామయ్య కూర్చున్నాడు. గబగబ భోంచేసి మజ్జిగ కావాలన్నాడు. సీతమ్మ పాలగదిలోకి వెళ్లుతున్నది. వెనకాలే కామయ్య. సీతమ్మ చీరకొంగు పట్టుకుని లాగాడు. సీతమ్మకు కాళ్లు వొణికాయి. వెనక్కి తిరిగి,

“ఆగునపంతో వాడి మెడమీద పొడిచింది.”

‘కామయ్యా, కూర్చో, మజ్జిగ తీసుకువస్తా’, అన్నది. కాని కామయ్య కూర్చోక పాలగదిగుమ్మందగ్గర నిలవబడ్డాడు. సీతమ్మ పాలగదిలోకి వెళ్లి చటుక్కున తలుపు బిడాయించుకుంది. దీప దీపాలవేళ. ఇంట్లో యెవ్వరూ లేరు. బలిగోరుకున్నట్టు సంధ్యచీకట్లు ఇంటి నాలుగుమూలలూ అలుముకున్నాయి. గదిలో సీతమ్మ. గదియివతల కామయ్య. తలుపు శాయశక్తులా కొట్టాడు కామయ్య. కాని లాభము లేకపోయినది. చిన్నగునపములాంటి పనిముట్టు ఒకటి మొలలోనుంచి తీశాడు. దానితో గది ద్వారం అడుగునుంచి పెల్లగించాడు. ద్వారబంధం క్రింద బాగా మనిషితలకాయ దూరేటంత రంధ్రం చేశాడు. దానిలో తనతల పెట్టాడు. ఆతల క్రమంగా గదిలోపలికి పోనిచ్చాడు చలువరాతిబొమ్మ వలెఉన్న సీతమ్మ గోచర మయింది కామయ్యకు. తల, మెడ, భుజములు పోనిచ్చాడు…సీతమ్మ గది మూలని ఉన్న గునపము తీసినది. ఎ త్తధైర్యం చూపడానికి తనలో శక్తి ఉన్నదో అంత ధైర్యంచూపింది. ఆగునపంతో వాడిమెడమీద పొడిచింది … ఆ గునపపుపోటుతో ఆశరీరం అక్కడాగిపోయింది. సీతమ్మగుండె దడదడా కొట్టుకొంటున్నది. కొట్టుకుని కొట్టుకుని కామయ్యప్రాణంపోయింది.

* * *

పోలీసులకు ఈవార్త తెలిసింది. ప్రక్కవూళ్లో కామయ్యఅనుచరులను వారు అరెస్టు చేసారు. హఠాత్తుగా కోనేటిగట్టునుండి వాళ్లమకాం ఎత్తివేయడం, సీతమ్మను చెఱబట్టవలెననే దురభిప్రాయంతో శ్రీనివాసం ఇంటి నౌకర్లు లేనిసమయాన్ని శ్రీనివాసంయింటికి కామయ్య వెళ్లడం, ఇందుకుగాను వాళ్లు పన్నిన పన్నుగడ, ఆదొంగలు పోలీసులకు విస్తరించి చెప్పారు. పిదప దొంగలకు కారాగారప్రాప్తి సంభవించింది. సీతమ్మ చూపిన సాహసానికి ఆమెను ఊరిలోనివారందరూ సన్మానించారు.